



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

కాటికాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-హిందూపురం

కాటి కాపర్లు చేస్తున్న సేవలను గుర్తించి, వారిని ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరా పార్కులో కాటికాపర్ల జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అథితిగా పాల్గొన్న రమణ మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఎన్నో సంవత్సరాలుగ కాటినే నమ్ముకుని కాటి కాపర్లు పని చేస్తున్న వారికి నేటికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వలేదని అవేదన వ్యక్తం చేశారు. కాటి కాపర్ల సేవలను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటి స్థలంతో పాటు ఏకరూప దుస్తులు, గ్లౌజులు, బూట్లు, బీమా, ఆరోగ్య బీమా, పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నా కాటి కాపర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా జిల్లా కాటికాపర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. కాటికాపర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా గోపాలప్ప, ప్రధాన కార్యదర్శిగా హనుమంత రాయుడు, ఉపాధ్యక్షులుగా కదిరప్ప, సహాయ కార్యదర్శిగా తిమ్మయ్యతో 30 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సదస్సులో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రాయుడు, నరసింహులు, మంజు, సరస్వతి, అనితమ్మ, రత్నమ్మ, రామంజి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవాకు ఇచ్చారు.. హెచ్ఎల్ఎసికి మరిచారు...

ఎస్కేయు, జెఎన్టియుకి గతమంతే.. ఉమ్మడి అనంత జిల్లాకు నిరాశే విపక్ష, వామపక్షాల పెదవివిరుపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్లో గతం కంటే నిధుల కేటాయింపులు కొంత వరకు పెరిగాయి. హంద్రీనీవాకు కేటాయింపులు పెంచినప్పటికీ, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఆశించినంత కేటాయింపులు పెరగలేదు. బడ్జెట్పై విపక్షాలు పెదవి విరుస్తుండగా, అధికార పార్టీ నేతలు మాత్రం మెరుగ్గా ఉందని కితాబునిచ్చారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రెండవసారి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్లో కేటాయింపులు ఈ విధంగానున్నాయి.

హంద్రీనీవాకు పెరుగుదల

హంద్రీనీవా ప్రాజెక్టు 2025-26 బడ్జెట్లో గతం కంటే పెరుగుదల జరిగింది. రెండు దశలకు కలిపి బడ్జెట్లో రూ.3446.51 కోట్లు కేటాయించారు. అంతక మునుపు ఏడాది అంటే 2024-25లో రూ.2014.24 కోట్లు కేటాయించి రూ.1765.24 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈసారి దాన్ని పెంచినప్పటికీ ఇందులో వెయ్యి కోట్ల రూపాయల వరకు విద్యుత్ బిల్లులున్నాయి. తక్కిన వాటిల్లో సుమారు రెండు వేల కోట్ల రూపాయల వరకు నిధులు హంద్రీనీవా పనులకు కేటాయించారు. ఇందులో ఏ మేరకు ఖర్చు పెడతారన్నది చూడాల్సి ఉంది. ఇకపోతే జిల్లాలోనున్న మరో ప్రధాన ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు రెండు దశలకు కలిపి రూ.70 కోట్ల వరకు కేటాయించారు. ఇందులో సాధారణమైన వాటికి పోనూ అభివృద్ధి పనులకు కేటాయింపులు మొక్కుబడిగానే ఉన్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి దయనీయంగా ఉన్న విషయం తెలిసిందే. ఆధునీకరణ చేపట్టాలన్న డిమాండ్ సర్వత్రా ఉంది. కాని నిధులు ఈ ప్రాజెక్టుకు పెద్దగా కేటాయింపులు జరగలేదు.

విశ్వవిద్యాలయాలకు పెరగలేదు.

జిల్లాలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం జెఎన్టియులు ఉన్నాయి. వీటికి గత ఏడాది బడ్జెట్లో కేటాయింపులు జరిపినంతనే ఈసారి జరిపారు. అంతకు మునుపు ఏడాది రూ.100.13 కోట్లు కేటాయిస్తే ఈసారి అంతే కేటాయించారు. అనంతపురం జెఎన్టియుకి రూ.58.7 కోట్లకుగానూ ఈసారి అంతే కేటాయించారు.

అప్పుల భారం మోపే విధంగా ఉంది

ఇచ్చిన హామీలు మరచి అప్పుల భారాన్ని ప్రజలపై మోపే విధంగా ఉంది బడ్జెట్. లక్ష కోట్లు అప్పులు చేయాలని నిర్ణయించడాన్ని బట్టి చూస్తే ప్రజలపై భారాన్ని మోపేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది.అనంతపురం జిల్లాకు సాగునీటి రంగానికి కొంత ప్రాధాన్యతను ఇచ్చినట్టు కనిపిస్తున్నా అందులో నిధులు వెచ్చించేది ఎంత అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ బడ్జెట్లో రూ.3446 కోట్లు కేటాయిస్తే అందులో వెయ్యి కోట్ల వరకు విద్యుత్ బిల్లులకే ఖర్చు చేయాల్సి ఉంది. **వి.రాంభూపాల్,**



సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

కార్మికులకు ఒరిగిందేమీ లేదు

వేతనాల కోసం పనిచేస్తున్న కార్మికులకు బడ్జెట్లో చోటు ఇవ్వక పోవడం బాధాకరం. ఎటువంటి జీవో ఇవ్వకుండానే మానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం గడ్డిని చూపించి గుర్రాన్ని పరిగెత్తించడంతో సమానం. కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయలేదు, కార్మికుల వేతనాల కోసం, సంక్షేమం కోసం తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన మార్పులు చేయాలి.



ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యోగ,ఉపాధ్యాయులను నిరాశపర్చిన బడ్జెట్

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగ,ఉపాధ్యాయులను నిరాశపరిచింది, బడ్జెట్లో 12 వ పిఆర్సి, ఆర్థిక బకాయిలు ఊసే లేదు, 2023 జులై నుంచి అమలు కావాల్సిన 12 వ పి ఆర్సికి కనీసం చైర్మన్ను కూడా ఈ ప్రభుత్వం నియమించక పోడం శోచనీయం. పిఆర్సి అమలు చేసే లోపు ఐఆర్ ఇచ్చేందుకు నిధులు కేటాయించకపోవడం దారుణం. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.



శెట్టిపి జయచంద్రా రెడ్డి
యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

సామాన్యుల సంక్షేమానికి పెద్ద పీట

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు గా భావించి రూపొందించిన బడ్జెట్ సామాన్యులకు ఎంతో ఉపయోగంగా ఉంది. అభివృద్ధి సంక్షేమం తో పాటు సూపర్ సిక్స్ హామీల అమలుకు రూపొందించిన బడ్జెట్ ఇది. రైతు సంక్షేమానికి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. తొలిసారి రాష్ట్ర బడ్జెట్ రూ. 3.22 కోట్లతో రూపొందించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్థిక మంత్రి కేశవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు



పల్లె రఘునాథరెడ్డి,
మాజీ మంత్రి,

హిందూపురం ఎఫ్ఎసి అసిస్టెంట్ కమిషనర్గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

హిందూపురం ఎఫ్ఎసి అసిస్టెంట్ కమిషనర్గామిటికేరి వెంకటేశ్వర్లు నియమిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు ప్రస్తుతం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు అదనపు బాధ్యతలుగా హిందూపురం ఎఫ్ఎసి అసిస్టెంట్ కమిషనర్గా నియమితులయ్యారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్లో ఇప్పటికే మడకశిర కమిషనర్ వై రంగస్వామి కార్పొరేషన్ సెక్రటరీగా అదనపు బాధ్యత నిర్వహిస్తుండగా తిరిగి డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లును అదనపు బాధ్యతలుగా హిందూపురం ఎఫ్ఎసి అదనపు కమిషనర్గా నియమించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన ఎంచుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ అన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలం కొటపి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకుని రెవిన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో గ్రామంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ మాట్లాడుతూ రెవిన్యూ చట్టాల గురించి, పోలీసు చట్టాల గురించి వివరించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ జగన్నాథ నాయక్, ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా మార్చుదాం

కలెక్టర్ టిఎన్. చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా సంబంధిత అధికారులు పనిచేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటు సారా నిర్మూలన కార్యక్రమం నవోదయ 2.0 పై జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం నవోదయం 2.0ను ప్రారంభించిందన్నారు. జిల్లాలో సరిహద్దు ప్రాంతాలను కలిగి ఉన్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వచ్చే నెల రోజులపాటు గ్రామాల్లో పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి నాటు సారా తాగడం వల్ల జరిగే నష్టాలను వివరించాలన్నారు. జిల్లాలో అక్రమ మద్యం సారా తయారీ పై పీడిత గ్రామాల జాబితాను ఏ, బి, సి, కేటగిరీలుగా విభజించడం జరిగిందన్నారు. ఏ కేటగిరిలో 8 గ్రామాలు, బి కేటగిరిలో 32 గ్రామాలు, సి కేటగిరిలో 12 గ్రామాలను గుర్తించామన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరడానికి తహశీల్దార్ అధ్యక్షతన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నాటు సారా తయారు చేసినా, అమ్మినా, 8 ఏళ్ల జైలు శిక్షతోపాటు 5 లక్షల వరకు జరిమానా విధించడం జరుగుతుందని వివరించాలన్నారు. ఆ వృత్తి నుండి వారిని దూరం చేసి ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందించి గౌరవప్రదంగా జీవించడానికి తగిన ఉపాధి మార్గాలు చూపాలన్నారు. అనంతరం కలెక్టర్ గోడ పత్రికలు కరపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, జిల్లా అధికారి గోవింద నాయక్, నరసింహులు, ఆర్డీవోలు సువర్ణ, శర్మ, ఆనంద్, మహేష్, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఉండవు.. బిల్లులు ఇవ్వరు...

ఏ వ్యాపారం చేయాలన్నా తప్పని సరిగా ఆయా శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆహార పదార్థాల వ్యాపారులు తప్పని సరిగా ఆహార భద్రత శాఖ అధికారుల అనుమతులు పొందాల్సి ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి అనమతులు తీసుకోవాల్సి ఉంది. దీంతో పాటు ఇతర శాఖ అనుమతులు పొందాలి. అయితే హిందూపురం పరిధిలో బియ్యం వ్యాపారులు కేవలం వాణిజ్య శాఖ అనుమతులు తీసుకుని విక్రయదారులకు మాత్రం ఏలాంటి బిల్లులు ఇవ్వకుండా తమ వ్యాపారాలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పట్టణంలో ఉన్న రైస్ మిల్లుల్లో నాణ్యత లేని బియ్యాన్ని, చౌకదుకాణాల్లో బియాన్ని కొనుగోలు చేసి వాటిని పాలీస్ చేసి వివిధ రకాల కంపెనీ పేర్లతో ముద్రించిన సంచుల్లో బియ్యం ప్యాక్ చేసి పట్టణంలో ఉన్న దుకాణాలకు సరఫరా చేస్తురన్నా ఆరోపణలు ఉన్నాయి. అయితే ఫౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్, ఆహార భద్రత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తే, ఆ సమయంలో వారికి మాముళ్లు సమర్పించి తమ వ్యాపారాలను ముడు పువ్వులు ఆరు కాయలుగా జరుపుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

- ◆ రైస్ మిల్లుల్లో అన్ని కంపెనీల బియ్యం ప్యాకెట్లు ప్యాకింగ్
- ◆ పట్టణంలో ఇష్టారాజ్యంగా బియ్యం వ్యాపారం
- ◆ పట్టించుకోని అధికారులు

ఆహార పదార్థాలపై కేంద్ర ప్రభుత్వం 2014లో ఆహార భద్రత చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం ఆహార పదార్థాలను విక్రయించే వారు తప్పని సరిగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. హిందూపురం పట్టణంలో దాదాపు 25 బియ్యం వ్యాపారుల దుకాణలు ఉన్నాయి. వీరిలో ఒకరిద్దరికి మినహా మిగిలిన ఎవరికి అనుమతులు లేవు. అనుమతులు పొందిన వారు సైతం రెన్యూవల్ చేసుకోలేదు. ఈ విషయం ఆయా శాఖల అధికారులకు తెలిసినప్పటికి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బియ్యం దుకాణంతో పాటు పట్టణంలో ఉన్న ప్రదాన హోటళ్లు,బేకరి, స్వీటు, ఇతర ఆహార పదార్థాల వ్యాపారులు అనుమతులు తీసుకోవాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఉండడంతో అధికారులు ఎవరు రారన్న ధీమాతో అనుమతులు పొందడం లేదని తెలుస్తోంది. మూడు మాసాలకు ఒక సారి అధికారులు వచ్చి ముడుపులు తీసుకుని వెళులుతున్నట్లు ఆరోపనలు వినిపిస్తున్నాయి. 2006 ఆహార భద్రత చట్టంతో పాటు 2019లో లూజ్ విక్రయాలు చేయరాదని చట్టం వచ్చింది. ఆహార భద్రతకు సంబందించి వ్యాపారులు ఏ ఒక్క చట్టాన్ని అమలు చేయకుండా తమ వ్యాపారాలను చేస్తున్నారు. బియ్యంలో ఏవి నాణ్యమైనవో తెలియక ప్రజలు నాశిరకం బియ్యం తీసుకుని నష్టపోతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనఖీలు చేసి అనుమతులు పొందని వారిపై కఠిన చర్యలు తీసుకుని కల్తీ లేకుండా చర్యలు తీసుకుంటే ఎంతో మంది అనారోగ్యం పాలు కాకుండా ఉంటారు.



పట్టణంలో ఉన్న బియ్యం దుకాణాలు

మార్కెట్ కమిటీ అనుమతులు ఎక్కడ...?

పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఉంది. అధికారులు ఉన్నారు. అయినప్పటికీ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేసే వారు తమ అనుమతులు తప్పని సరి అని తెలిసినప్పటికీ తనఖీలు చేయరు. చర్యలు తీసుకోరు. మార్కెట్ నిబందనల మేరకు వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేసే వారు అనుమతులు తీసుకుని, వారి వ్యాపార లావాదేవీలపై ప్రతినెల మార్కెట్ అధికారులకు నివేదికలు ఇవ్వాల్సి ఉంది. అయితే స్థానిక మార్కెట్ అధికారులకు పట్టణంలో వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార దుకాణాలు ఎన్ని ఉన్నాయో సైతం తెలియక పోవడం గమనార్హం. దీంతో మార్కెట్ ద్వారా ప్రభుత్వనికి అందే శిస్తు సైతం అందడం లేదు. ఈ వ్యాపారాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు తనఖీలు చేసి, అందరికి అనుమతులు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు ప్రజలకు కల్తీ లేని ఆహారం అందుతుంది.

ఓబుళాపురం

గనుల్లో నిశబ్దానికి పదహారేళ్లు...



భయంకరమైన శబ్దాలు, ముడి ఖనిజంతో తరలిపోయే లారీలు, కొండలను పిండి చేసే త్యాధునిక యంత్రాలు ఇది ఒకప్పటి ఓబులాపురం గనుల మైనింగ్ పరిస్థితి. కనుచూపుమేరలు ఎక్కడ చూసినా ఎర్ర మట్టి, ముడి ఇనుప ఖనిజం తరలించే లారీలు, గూడ్స్ల రాకపోకలతో ఆ ప్రాంతమంతా సందడిగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అంతా నిశ్శబ్దం. ఒక్కరి స్వార్థం ఎంతోమందికి శాపంగా మారింది. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఎంతో కొంత నీతి నిబద్ధత పాటించి మైనింగ్ కార్యకలాపాలు సాగించిన కంపెనీలు కూడా గాలి జనార్దన్ రెడ్డి చేసిన అవినీతి అక్రమాలకు బలైపోయారు. ఆయన అక్రమాల కారణంగా ప్రభుత్వం గనుల తవ్వకాలను నిషేధించింది. ఇది జరిగి నేటికి 16 ఏళ్లు అయింది.

ప్రజాశక్తి - డి.హీరేహాల్

ఒకరి స్వార్థం... ఎందరికో శాపం

డి. హీరేహాల్ మండలంలో విస్తారంగా ఇనుప ఖనిజం గనులు ఉన్నాయి. ఈప్రాంతరం ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దుల్లో ఉంది. అప్పట్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కర్నాటకలో మంత్రిగా పనిచేసిన గాలి జనార్దన్ రెడ్డి చేతులు కలిపి ప్రకృతి సంపదను నిలువునా దోచుకున్నారన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాలి జనార్దన్ రెడ్డిని సిబిఐ అరెస్టు చేసింది. జిల్లాలో ఓఎంసి 1, ఓఎంసి2, ఎజికె, అంతర్ గంగమ్మ కొండలతో పాటు బిఐపి, వై .మహాబలేశ్వరంపై మైనింగ్ కంపెనీల పేర్లతో గనుల్లో తవ్వకాలకు అనుమతులు పొందారు. ఇనుపముడి ఖనిజం ధర భారీగా పెరగడంతో గాలి జనార్ధనరెడ్డి నిలువు దోపిడీ చేశారని అప్పట్లో కోర్టులో పిల్ దాఖలయింది. ఈ నేపథ్యంలో సిబిఐ దర్యాప్తు ప్రారంభించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. గాలి జనార్దన్ రెడ్డి తను ఈసీ పొందిన గనులతో పాటు ఇతర కంపెనీలు అనుమతి పొందిన ప్రాంతంలోనూ, అటవీ భూముల్లోనూ అక్రమంగా మైనింగ్ చేశారని, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులు, జిటి స్టేషన్ ట్రై జంక్షన్ గుర్తులను కూడా చెరిపేసి నట్లు గుర్తించారు. వీటితోపాటు సుంకులమ్మ దేవాలయాన్ని కూడా కూల్చి మేలు రకం ముడి ఇనుమును దోచుకున్నారని సిబిఐ అభియోగం మోపింది, ఇందులో భాగంగానే వైయస్సార్ మరణానంతరం ఏర్పడిన రోశయ్య ప్రభుత్వం గనుల్లో తవ్వకాలు నిషేధించింది అప్పటినుండి గనుల్లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. మైనింగ్ కార్యకలాపాలు ఆగిపోవడంతో ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు దీనికి తోడు ఈ ప్రాంతంలో నివసిస్తున్న గ్రామ ప్రజలు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పోతున్నారు. ఈనేపథ్యంలో మైనింగ్ తిరిగి వచ్చేనా అంటూ స్థానికులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

బాలయ్య పిఎగా వీరయ్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిఎగా వీరయ్యను నియమిస్తు ప్రిన్సిపల్ సెక్రేటరీ వాణి మోహన్ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం వీరయ్య కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన గతంలో బాలకృష్ణ పిఎగా విధులు నిర్వహించారు. మరో సారి వీరయ్యను పిఎగా నియమిస్తు ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. త్వరలో పురానికి వచ్చి వీరయ్య బాధ్యతలను స్వీకరించనున్నారు.



బాలయ్య పిఎగా నియమితులైన వీరయ్య

టెక్నాలజీ పురోగతితోనే దేశాభివృద్ధి

జెవివి కార్యదర్శి డాక్టర్ ఇటి. రామ్మూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

సైన్స్ అండ్ టెక్నాలజీలో పురోగతి సాధించినప్పుడే దేశం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని జెవివి కార్యదర్శి డాక్టర్ ఇటి రాంమ్మూర్తి అన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలం ఎల్ఆర్జి పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి నాయకులు మాట్లాడుతూకొత్త తరం సృజనాత్మకత ఆలోచనలు వెలికి తీసే ప్రయత్నం నిరంతరం జరుగుతునే ఉండాలన్నారు. విద్యార్థులకు సాంకేతికతతో పాటు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందించడంలో సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం జెవివి నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణ సైన్సు కు మూఢనమ్మకాలకు గల వ్యత్యాసాలను ఉదాహరణలను ప్రయోగాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, చైతన్య గంగిరెడ్డి, ఉగ్రప్పతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవివి కార్యదర్శి డాక్టర్ ఇటి రామ్మూర్తి

సివిల్ సప్లై హమాలీల నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సివిల్ సప్లై హమాలీ లు నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కూలి రేట్లకు సంబంధించి ఒప్పందం మేరకు జీఓ జారీ చేయడంలో ప్రభుత్వం కాల యాపన చేయడాన్ని నిరసిస్తూ కార్మికు లు ఆందోళన చేపట్టారన్నారు. ఎపి సివిల్ సప్లై హమాలీల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెరిగిన కూలి రేట్లు, 14 నెలల అరియర్స్ చెల్లింపులకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని, ఈఎస్ఐ, తదితర సమస్యలపై హమాలీ సంఘాల నాయకులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మార్చి 4వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా మండల కార్యాలయాలు వద్ద ధర్నాలు, 7న విజయవాడ ఎండి ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపుఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మార్చి 20 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు సుధాకర్, భక్తర్‌వలి, జబ్బార్, హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు.



గోరంట్లలో సివిల్ సప్లై గోడౌన్ వద్ద మోకాళ్లపై హమాలీల నిరసన

మోకాళ్లపై హమాలీల నిరసన

గోరంట్ల : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో హమాలీలు స్థానిక సివిల్ సప్లై గోడౌన్ వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. రమేష్ మాట్లాడుతూ హమాలీల సమస్యలు, డిమాండ్లను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు గంగాధర్, బాబావలి, అశోక్‌రెడ్డి, నరసింహులు, బాబు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీలోని 2, 3, 4 వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆయా వార్డుల మహిళలు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ తాగునీటి మోటార్లు చెడిపోవడంతో 3 నెలల నుంచి వార్డుల్లో పది రోజులకు ఓ సారి తాగునీరు సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదన్నారు. అనంతరం కమిషనర్ ప్రహ్లాద, ఛైర్మన్ తుంగా ఓబుళపతి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి 2వ వార్డులో పర్యటించగా మహిళలు వారిని అడ్డగించారు. వాటర్ మెన్ సరిగా పని చేయడం లేదని, దురుసుగా మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మహిళల నిరసన

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా మార్చి 1 నుంచి 20వ తేదీ వరకూ 42 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్, ఉపాధ్యక్షుడు పవన్ స్థానిక డివైఈఓ కార్యాలయంలో డివైఈవో రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మెడికల్ కిట్లు, సీసీ కెమెరాలు, వికలాంగులకు వీల్‌చైర్, కుర్చీలు ఏర్పాటు చేయాలని కోరారు. కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్షల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. వారి వెంట ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్, నాయకులు భరత్, శీను, పవన్‌నాయక్, లోకేష్, అనిల్, విశ్వనాథ్ ఉన్నారు.



డివైఈవో రఘునాథరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎస్ ఎఫ్ఐ నాయకులు

ధర్మవరం రూరల్ : పట్టణంలో ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో మహేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అనిల్, పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్, ఉపాధ్యక్షుడు అమన్, నాయకులు సిద్ధిక్ పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-గుడిబండ

'నవోదయం'లో భాగంగా శుక్రవారం మడకశిర ఎక్సైజ్ సిఐ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో మండలం లోని జిఎస్ తండా గ్రామంలో నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. సిఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం, విక్రయించడం నేరమని, అతిక్రమిస్తే 8 ఏళ్ల జైలు శిక్ష, రూ. 5 లక్షల జరిమానా విధిస్తామన్నారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్థిక స్వావలంబన కోసం బ్యాంకులు, మహిళా సంఘాల ద్వారా ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుని గొర్రెలు, మేకలు, బర్రెలు, పశువులు కొనుగోలు చేసి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శంకర్, దేవరహట్టి పంచాయతీ సర్పంచి సతీష్ కుమార్, గ్రామ కార్యదర్శి ప్రకాష్, విఆర్ఓ రామప్ప, తండావాసులు, మహిళలు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన సబ్‌కలెక్టర్


ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక దుర్గా వీరభద్ర పాపనసేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ ఆనంద్‌కుమార్ సందర్శించారు. ముందుగా ఆయనకు అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన అన్నదానం సత్రాన్ని సందర్శించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో చండీయాగం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ వెంట తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, టిడిపి మండల కన్వీనర్ జయప్ప, ఎంపిటిసి లలితమ్మ, అర్చకులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక కెజిబివి పాఠశాల, కళాశాలలో శుక్రవారం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు వీరభద్రప్ప పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు, మెటీరియల్ పంపిణీ చేశారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు బాగా రాసి పాఠశాల, తల్లిదండ్రులు, ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అలాగే సాయిరామ్, చంద్ర భోజనం పాఠశాలకు ప్రెజర్ కుక్కర్లను అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నీలిమ, యోగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.



బాలయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

బాలయ్యకు ఎమ్మెల్యే సత్కారం

ప్రజాశక్తి-మడకశిర

పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సత్కరించారు. ఎపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ఎమ్మెల్యే రాజు బాలయ్యను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

రీ సర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని మానేంపల్లి పంచాయతీలో జరుగుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి పరిశీలించారు. రైతులతో మాట్లాడి భూముల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కా రానికి కృషి చేస్తామన్నారు. కోర్టు సమస్యలు, వివాదాలు ఉన్న భూములను జాగ్రత్తగా సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకి సంబంధించిన భూమిని రీ సర్వే చేసి ల్యాండ్ పొజిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆమె వెంట సర్వేయర్ లోకేంద్రనాథ్, కోకిల, సురేష్, రైతులు ఉన్నారు.

నార్సింపల్లిలో సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని నార్సింపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ ప్రజలను చైతన్యం చేశారు. ఎంపిడిఒ రంగారావు, తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులే అని వివరించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్, ప్రభుత్వం నుంచి వారికి అందే సహకారం, హక్కుల గురించి తెలిపారు. కార్యక్రమంలో పోలీసు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మద్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన 3 ద్విచక్ర వాహనాలను శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి గోవింద నాయక్ ఆధ్వర్యంలో వేలం వేసినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజు తెలిపారు. ఎక్సైజ్ సిఐ మాట్లాడుతూ 3 బైక్‌లు, ఒక కారు జీఎస్టీతో కలిపి మొత్తం రూ. 75,520 వేలంలో దక్కించుకున్నారన్నారు. వేలంలో ఎక్సైజ్ ఎస్ఐ ఉమామనోహర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని నడిమిపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ ఈ నెల 25వ తేదీ మృతిచెందిన ఉపాధ్యాయుడు ఎం.ఇంద్రప్రసాద్ సంతాపసభను శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముందుగా ఎంఇఒలు ఇంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఒక మంచి ఉపాధ్యాయుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఇంద్రప్రసాద్‌తో తమకున్న అనుబంధాన్ని, అతడు ఉపాధ్యాయులకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

మధ్యలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు..

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై ఉన్నఫళంగా ఆగిపోతున్నాయి. పది రోజుల నుంచి ప్రతి రోజూ ఏదో ఒక చోట బస్సులు ఉన్నఫళంగా నిలిచిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం పెనుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 10 గంటల సమయంలో పావగడ వైపు నుంచి పెనుకొండకు వస్తూ మార్గమధ్యలో రొద్దం సమీపంలో బ్రేక్ లైనర్లు పాడవడంతో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఉన్న ఫళంగా రోడ్డుపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-కదిరిటౌన్

మానవాళి మనుగడకు సైన్స్ ఎంతో దోహదపడుతుందని బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్ తెలిపారు. రూరల మండలంలోని బ్లూమూన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శివశంకర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి మాధవరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కిరణ్ మాట్లాడుతూ జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

మడకశిర : మండలంలోని రేకులకుంట ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గిరిజ ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభార్గవి, ఎం.దత్తాత్రేయ, పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని బిటిఆర్ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 7 అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఇఒలు చంద్రశేఖర్, ఎం.సుధాకర్ బహుమతులు అందజేశారు. 30 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



కదిరి పట్టణ సమీపంలోని హరీష్ స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని లయోలా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సైన్స్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ శంకర్‌నాయుడు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ గోపాల్ నాయక్, డాక్టర్ సుబ్బారావు, వన్ టౌన్ ఎస్ఐ కేతన్ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను తిలకించి హర్షం వ్యక్తం చేశారు. సైన్స్ డేలో వాటర్ లెవెల్ డిటెక్టర్(9వ తరగతి), స్టేట్స్-క్యాపిటల్(8వ తరగతి), రెస్పిరేటరీ సిస్టం(9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక వశిష్ట పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను ముఖ్యఅతిథులు ఎంఇఒ సురేష్, ఉపాధ్యాయులు పవన్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, గౌరీశంకర్‌రెడ్డి పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ పావని, వైస్ ప్రిన్సిపల్ గంగాద్రి, ఉపాధ్యాయులు రమణ, అమానుల్లా, గంగప్ప, నళిని, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తచెరువు : స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిఇఒ కార్యాలయ ఎడి లాజర్ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను పరిశీలించా రు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ, డీన్ హనుమంతు, ఏవో కేశవరెడ్డి, ప్రైమరీ కోఆర్డినేటర్ అనిత, ప్రైమరీ ఇన్‌ఛార్జి భార్గవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని భాష్యం, చైతన్య పాఠశాలల్లో జరిగిన సైన్స్ దినోత్సవంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సతీష్, నాగేంద్రమ్మ, ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ మూర్తి, హెచ్‌ఎం సల్మా పాల్గొన్నారు. చైతన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, డీన్ నాగరాజు, ఏఓ ప్రభాకర్ పాల్గొన్నారు. కిరికెర వద్ద ఉన్న ఎల్‌ఆర్‌జి పబ్లిక్ స్కూల్‌లో ఇస్రో శాస్త్రవేత్త ప్రకాశ్ బి.శిగ్గావి పాల్గొని సైన్స్‌డేను ప్రారంభించారు. ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మానవతా సంస్థ ఫౌండర్ తరిమెల అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పచ్చని పొలాల్లో సోలార్‌ను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని మర్రికొమ్మదిన్నె పంచాయతీలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్రాజెక్టును అడ్డుకుంటామని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షుడు హరి తెలిపారు. రైతుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ మార్చి 3వ తేదీ తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసనకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందించడం మాని కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ పచ్చని పొలాల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. అదానీ, ఇండోసోల్ కంపెనీలకు రైతుల భూములను కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధర, సాగునీరు, మార్కెట్ సౌకర్యాలు, సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పగటి పూట నాణ్యమైన విద్యుత్, చుక్కల భూములతో సహా సాగులో వున్న బంజరు భూములకు పట్టాలు, సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీతో డ్రిప్, స్ప్రింకర్లు, సౌర పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగిరెడ్డి, సిఐటియు మండల నాయకులు నాగరాజు, రైతు సంఘం నాయకులు ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

కార్మికులను పర్మినెంట్ చేయాలి:సిఐటియు

ప్రజాశక్తి-పెనుకొండ

ఆప్కాస్ రద్దు చేయకుండా కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికులు పోస్ట్‌కార్డులను సిఎం చంద్రబాబుకి పంపారు. సిఐటియు నాయకులు బాబావలి, రమేష్ మాట్లాడుతూ పౌరుగు సేవల కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి గుత్తేదారులకు అప్పగిస్తే సకాలంలో వేతనాలు అందక ఉద్యోగ భద్రతను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, లక్ష్మీదేవి, రాము, నరసింహ, నరసమ్మ, సూరి, చంద్ర, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుకి పోస్ట్‌కార్డులు పంపుతున్న కార్మికులు

అజెండాలోని అంశాలకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో అజెండాలోని అంశాలపై కౌన్సిలర్లందరూ ఆమోదం తెలిపారని ఛైర్‌పర్సన్ తెలిపారు. 2016-17లో ఎన్‌ఆర్‌ఈజిఎస్ కింద చేసిన పనులకు మున్సిపల్ సాధారణ నిధులు మంజూరు చేయాలని అజెండాలో ఉంచగా కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డితో పాటు మిగిలిన కౌన్సిలర్లు వ్యతిరేకించారు. దీంతో ఛైర్‌పర్సన్ రెండు తీర్మానాలను తిరస్కరించారు. మున్సిపల్ ట్యాంకులను శుభ్రం చేయడం లేదని, పర్యవేక్షణ కొరవడిందని తద్వారా రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని పలువురు కౌన్సిలర్లు తెలిపారున. స్పందించిన కమిషనర్ ప్రమోద్‌కుమార్ ట్యాంకులను శుభ్రం చేసే సమయంలో కౌన్సిలర్లకు సమాచారం ఇస్తానని తెలిపారు. కదిరి గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య జఠిలమైందని, ఇటీవల ఒక విద్యార్థి కూడా మృతి చెందాడని తెలిపారు. ట్రాఫిక్ పై సంబంధిత అధికారులతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పలుచోట్ల వీధిలైట్లు వెలగడం లేదని లేవనెత్తగా స్టాక్ లేవని వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ శంషాద్‌బేగం, కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శామ్సన్, కేశవ, టిపిఒ విజయభాస్కర్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, కౌన్సిలర్లు

కోనేరు స్థలాన్ని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని గుడిపల్లి గ్రామంలో వెలసిన ప్రముఖ దేవాలయం శ్రీసజ్జగంట రంగనాథస్వామి ఆలయ కోనేరును కాపాడాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తుఉలు తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వో నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొందరు వ్యక్తులు కోనేరును ఆక్రమించుకొని కంచె వేయడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే మండల సర్వేయర్‌తో కోనేరు స్థలాన్ని సర్వే చేయించి హద్దులు కనబరిచి ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరారు. అలాగే ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతిని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన తహశీల్దార్ దేవాదాయ భూములు ఆక్రమించడం నేరమని, సర్వేయర్‌ను గ్రామినికి పంపించి హద్దులు ఏర్పాటు చేసి కోనేరును కాపాడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉద్యోగ విరమణ సహజం : డిఆర్‌డిఎ పిడి

ప్రజాశక్తి-మడకశిర

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని డిఆర్‌డిఎ పిడి కెఎన్.నరసయ్య, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండలంలో ఇన్‌ఛార్జి ఎపిఎంగా పని చేస్తున్న ఎన్.నరసేగౌడ్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో వారు ఎన్.నరసేగౌడ్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డిఆర్‌డిఎ వెలుగు కుటుంబ సభ్యులు, మండల సమాఖ్య ప్రతినిధులు, యానిమేటర్లు, ఈసీ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యాధికారికి సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక పిహెచ్‌సిలో మండల వైద్యాధికారిగా సేవలందిస్తున్న డాక్టర్ సి.హరికుమార్ ఉన్నత చదువులు(పీజీ కోర్సు) కోసం వెళ్తుండగా శుక్రవారం వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ హరికుమార్ నాలుగేళ్లుగా ఈ వైద్యశాలలో ఎనలేని సేవలు అదించారని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఓంకార్, అశ్విన్‌కుమార్, సిబ్బంది మనోహర్‌రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, మధు, అనిల్, రమణ, ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒ, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, విదేశీ ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పశువులకు టీకా వేయించండి

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని పాడి రైతులు తమ ఆవులు, గేదెలకు వ్యాధులు సోకకుండా టీకా వేయించుకోవాలని పశువైద్యాధికారి బి.చెన్నకేశవ నాయక్ సూచించారు. గాండ్లపెంటలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆవులు, గేదెలకు ముందు జాగ్రత్త చర్యగా కాలుకుంటి వ్యాధి సోకకుండా టీకా వేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది ప్రతి గ్రామానికి వచ్చి టీకా వేస్తారని తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉద్యోగ విరమణ ఎడికి సన్మానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని డిఇఒ క్రిష్టప్ప తెలిపారు. డిఇఒ కార్యాలయంలో ఎడి-1గా పనిచేస్తున్న నాగరాజు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో డిఇఒ కార్యాలయం వద్ద సన్మాన సభ ఏర్పాటుచేశారు. డిఇఒ మాట్లాడుతూ నాగరాజు అంకిత భావంతో విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించారన్నారు. అనంతరం డిఇఒ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉద్యోగులు నాగరాజును పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎడి-2 రామకృష్ణ, డిఇఒ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన డిఇఒ కార్యాలయం ఎడి-1 నాగరాజు దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఎంపిపి వాహనంపై రాళ్లదాడి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని సంకేపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపిపి ఆదినారాయణయాదవ్ వాహనంపై కొందరు రాళ్ల దాడికి పాల్పడ్డారు. వీరనారాయణ స్వామి ఉత్సవాల్లో గురువారం టిడిపి, బిజెపి నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం ఆయన స్వగ్రామం నుంచి సంకేపల్లి గ్రామం మీదుగా వెళుతున్న సమయంలో కొందరు రాళ్లతో దాడి చేశారు. దీంతో రెండు వర్గాల అనుచరులు ముదిగుబ్బ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. స్టేషన్ వద్ద ఇరువర్గాల వారు పెద్దఎత్తున గుమికూడడంతో ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఇరు వర్గాలను హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-కదిరి టౌన్

అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు తాళలేక ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. కుటాగుళ్ల తారకరామనగర్‌లో నివాసం ఉంటున్న ఈరమల్ల ఆదెప్ప కుటాగుళ్లకి చెందిన హరిప్రసాద్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదెప్ప హరిప్రసాద్ వద్ద రూ. 50 వేలు అప్పుగా తీసుకుని, కూలి డబ్బులను అప్పుడప్పుడు అప్పులోకి జమ చేస్తూ వచ్చాడు. అయితే అసలు, వడ్డీ కలిపి ఇంకా రూ. 1,14,000 కట్టాలని హరిప్రసాద్, అతడి భార్య లక్ష్మీదేవి, వారి తరపు వ్యక్తులు ఆదెప్ప, అతడి భార్య శశికళ, అత్త లక్ష్మీదేవిలను దుర్భాషలాడడంతో పాటు వారిపై దాడి చేశారు. అనంతరం ఇరు వర్గాల వారు పోలీసు లను ఆశ్రయించారు. పోలీస్‌స్టేషన్ బయటకు రాగానే హరిప్రసాద్ మరోమారు ఆదెప్పతో గొడవ పడ్డాడు. దీంతో మనస్థాపం చెందిన ఆదెప్ప సూపర్ వాస్మోల్ తాగాడు. అప్రమత్తమైన ఆదెప్ప భార్య, పోలీసులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. ఆదెప్ప భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని జమ్మలబండ గ్రామ సమీపంలో కర్నాటకలోని కోట కొత్తూరు క్రాస్ వద్ద శుక్రవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని దేవరహట్టి గ్రామానికి చెందిన నాగేంద్ర ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 115 కర్నాటక మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు మడకశిర ఎక్సైజ్ సిఐ ప్రసాద్‌రావు తెలిపారు. నాగేంద్రను మడకశిర కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపినట్లు సిఐ తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్ఐ శంకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని చీకటిమానిపల్లి వద్ద ఉన్న ఆత్మిక పేపర్ మిల్లు వద్ద శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. సుమారు 40-45 ఏళ్ల వయసు ఉంటుందని, ఛాతి మీద బాబాజాన్ అని పచ్చబొట్టు ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు ఎస్ఐ గోపి, కదిరి రూరల్ సిఐ నాగేంద్రకి సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాచకులకు కౌన్సెలింగ్.. స్వచ్ఛంధ సంస్థలో అప్పగింత

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో చంటి పిల్లలతో భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి సమతా స్వచ్ఛంధ సంస్థలో అప్పగించినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సిఐ మాట్లాడుతూ సమతా స్వచ్ఛంధ సంస్థ సభ్యులతో కలిసి పట్టణంలో కలియ తిరిగి చంటి పిల్లలను చూపించి భిక్షాటన చేస్తున్న నలుగురు తల్లులను గుర్తించామన్నారు. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం సమతా స్వచ్ఛంధ సంస్థలో అప్పగించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సమతా స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలోని రైల్వేస్టేషన్ రహదారి పక్కన ఉన్న ఎయిమ్స్ వైద్యశాలలో మార్చి 2వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఈవో దాదు తెలిపారు. ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. హెర్నియా(వరిబీజం), కిడ్నీలో రాళ్లు, రొమ్ములో గడ్డలు, షుగర్ పుండ్లు, ఫైల్స్(మొలలు), తదితర జబ్బులకు చికిత్స చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులు వెంట తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.